క్లుప్తంగా

డయాలసిస్ రోగికి రూ.10వేల పింఛన్ మంజూరు



ముస్నలూరు(కంచికచర్ల): మండలంలోని ముస్నలూరు గ్రామానికి చెందిన డయాలసిస్ రోగి సూర్యదేవర పూర్ణచంద్రరావుకు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసిందని ఎంపీడీఓ కె.బాలశంకరరావు మంగళవారం తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ గ్రామంలో గతంలో ముగ్గురికి డయాలసిస్ పెన్షన్ మంజూరైందన్నారు. ప్రస్తుతం పూర్ణచంద్రరావుకు మంజూరైన రూ.10 వేల పెన్షన్‌ను గ్రామ సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ షేక్ నాగేంద్ర బాజీ లబ్ధిదారునికి అందజేశారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



నందిగామ:పట్టణంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని ఆరవ వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలను ఆయన స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమలు వ్యాపించకుండా ఉండేందుకు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ప్రజలు కూడా పారిశుద్ధ్యం మెరుగుకు సహకరించాలన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆరవ వార్డు కౌన్సిలర్ షేక్ యాకూబ్ అలి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



చిట్టేల(వత్సవాయి): శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండవరోజు మంగళవారం పుణ్యాహవాచన, భేరీపూజ, యాగశాల, వాస్తుశుద్ధి ధ్వజపట ప్రతిష్ఠ అధివాస త్రయము, అధివాస హోమం, ధ్వజారోహణం కార్యక్రమాలను వేద పండితులు దీవి బాలాజీ రంగాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు హరి శివరామప్రసాదుశాస్త్రి, సిరికొండ వెంకటసాయి కృష్ణమాచార్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ నిర్మాణ ధర్మకర్త మార్శెట్ల పుల్లారెడ్డి దంపతులు గోపూజ, తులసీపూజ స్వామివారి పూజా కార్యక్రమాలను చేశారు.

కొనసాగుతున్న నరసింహుని కల్యాణోత్సవాలు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి తిరుక్కల్యాణ మహోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారికి పలు విశేష పూజలు చేశారు. ప్రధానార్చకుడు వేదాంతం శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నాగరాజు, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మండలంలో 91 శాతం పింఛన్ల పంపిణీ

పెనుగంచిప్రోలు: మండలంలో మంగళవారంతో సామాజిక పింఛన్ల పంపిణీ 91 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నారన్నారు.

మనిషిలో దైవత్వాన్ని మేల్కొలపాలి

జగ్గయ్యపేట అర్బన్: మనిషిలో దైవత్వాన్ని మేల్కొలిపి సమాజానికి సేవ చేసే వ్యక్తులుగా తీర్చిదిద్దాలనేదే క్రీస్తు బోధ అని పాస్టర్ అగస్టీన్ అన్నారు. స్థానిక చెరుకూరివారి వీధిలోని అమృత టింబర్ డిపోలో యేసు నిత్యారాధన మందిరం వారి ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహించిన పెంతెకోస్తు పండుగ వేడుకల్లో ఆయన ముఖ్య ప్రసంగీకులుగా పాల్గొన్నారు. చివరిరోజు మంగళవారం రాత్రి జరిగిన సభలో ఆయన దైవ సందేశాన్ని అందించారు. క్రైస్తవ్యం అనేది మతం కాదని, దేవుని చేరుకునే మార్గం అని అన్నారు. టింబర్ డిపో అధినేత సోమవరపు బాబు, పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల ఆర్థిక అభ్యున్నతికి సీఎం కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు
- నియోజకవర్గంలోని నాలుగు మండలాల డ్వాక్రా సభ్యులు, అధికారులతో సమావేశం



పెండ్యాలలో జరిగిన పొదుపు సంఘాల సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పెండ్యాల(కంచికచర్ల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు సంఘాలను బలోపేతం చేస్తూ డ్వాక్రా మహిళలను ఆర్థికంగా ఎదిగేలా పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని పెండ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నియోజకవర్గంలోని కంచికచర్ల, నందిగామ, చందర్లపాడు, వీరులపాడు మండలాల పొదుపు సంఘాల మహిళలు, అధికారులు, మండల సమాఖ్య అధ్యక్షులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్వాక్రా మహిళల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సీఎం జగన్ డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేస్తున్నారని, వారు దుకాణాలు ఏర్పాటు చేస్తే బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని కోరారు. జగనన్న కాలనీలలో ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా ఇల్లు కట్టుకునేందుకు రుణాలు కూడా మంజూరు చేస్తున్నారన్నారు. పొదుపు సంఘాల బ్యాంకు ఆర్థిక లావాదేవీలపై వెలుగు సీసీలు, బుక్ కీపర్లు, వీఓఏలు పూర్తి సమాచారం తెలియజేయాలన్నారు. డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేసే విషయంలో ఎటువంటి లంచాలు తీసుకోరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, కంచికచర్ల, వీరులపాడు జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, అమర్లపూడి కీర్తి సౌజన్య, ఎంపీటీసీ సభ్యులు షేక్ బడే హజరత్, ఏఎంసీ డైరెక్టర్ షేక్ చాన్ బహదూర్, కంచికచర్ల మహిళా సమాఖ్య అధ్యక్షులు కంచర్ల పద్మావతి, నాలుగు మండలాల ఏపీఎంలు కోట భాస్కరరావు, సుబ్రహ్మణ్యం, కేవీ రమణ, సుధారాణి, సీసీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నిరుపేదల జీవన ప్రమాణాలు పెరిగేలా పాలన

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



చౌటపల్లిలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చౌటపల్లి(వీరులపాడు): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పారదర్శక పాలన అందించటంతో పాటు నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారని శాసన సభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని చౌటపల్లి గ్రామంలో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించటంతో పాటు ప్రజా సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పాలన సాగుతోందని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం కానీ, ఏ ప్రజాప్రతినిధి కానీ మేం ఇది చేశామని చెప్పుకుంటూ ప్రజల వద్దకు వెళ్లిన పరిస్థితి లేదని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల ముందుకు సగర్వంగా వెళ్తున్నామన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉంటే పాలన ఎలా ఉంటుందో రాష్ట్ర ప్రజలు చూస్తున్నారని తెలిపారు. ప్రజలకు నిరంతరం మంచి చేయాలనే తపనతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలిచి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ పల్లెపోగు పుల్లయ్య, ఉప సర్పంచ్ కోట సంగయ్య, ఎంపీటీసీ సభ్యురాలు పల్లెపోగు మార్తమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కోట రామారావు, మండల రైతు విభాగం కన్వీనర్ మట్టూరి సాయిబాబు, పలువురు నాయకులు, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పంట నష్టంపై ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తాం

ఏపీ ఆగ్రో డెవలప్‌మెంట్ డైరెక్టర్ కొండారెడ్డి



నందిగామ: అకాల వర్షం కారణంగా నష్టపోయిన పసుపు రైతులకు ప్రభుత్వం ద్వారా న్యాయం జరిగేలా చూస్తానని రాష్ట్ర ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి అన్నారు. అకాల వర్షం కారణంగా మండలంలోని పెద్దవరం పరిసర ప్రాంతాలలో కల్లాలలో ఉన్న పసుపు కొమ్ములు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యానవన శాఖ అధికారి నీలిమతో కలిసి మంగళవారం ఆయన దెబ్బతిన్న పసుపు కల్లాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేతికొచ్చిన పసుపుకొమ్ములు అకాల వర్షం కారణంగా దెబ్బతిన్నాయని, అధికారులు నష్టం అంచనా వేయగానే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

వేలం పాటలు వాయిదా

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో నిర్వహించనున్న వేలం పాటలను వాయిదా వేసినట్లు ఆలయ ఈవో నాగరాజు మంగళవారం తెలిపారు. ఆలయంలో లడ్డూ తయారీ సామగ్రితో పాటు పలు రకాల వేలం పాటలు జరగాల్సి ఉండగా పాటదారులు రాకపోవటంతో వాయిదా వేసినట్లు చెప్పారు.

సచివాలయం తనిఖీ

నందిగామ: పట్టణంలోని 10 వ నంబరు సచివాలయాన్ని మంగళవారం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుతో పాటు మూవ్‌మెంట్ రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం సచివాలయాల ద్వారా అందుతున్న సేవలు, పెండింగ్‌లో ఉన్న అంశాలకు సంబంధించి సచివాలయ సిబ్బందితో చర్చించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కేసుల ఎత్తివేతపై కాపు నాయకుల హర్షం



పేటలో వంగవీటి రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్రీకృష్ణదేవరాయ సేవాసమితి ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్: కాపులపై గత తెలుగుదేశం ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించిందని శ్రీకృష్ణదేవరాయ సేవాసమితి సభ్యులు అన్నారు. కాపు సంఘ నేత ముద్రగడ పద్మనాభంపై ఉన్న కేసులను రైల్వే కోర్టు కొట్టివేసినందుకు స్థానిక శ్రీకృష్ణదేవరాయ సేవాసమితి(కాపు సంఘం) సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కోదాడ రోడ్డులోని వంగవీటి రంగా విగ్రహం వద్ద మిఠాయిలు పంచారు. అనంతరం రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సేవాసమితి ప్రతినిధి, మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ విలేకరులతో మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు ముద్రగడ పద్మనాభంపై 69 కేసులను అక్రమంగా పెట్టించారని, నేడు రైల్వే కోర్టు ఆ కేసులన్నీ కొట్టివేసిందని తెలిపారు. కాపులపై గత తెలుగుదేశం ప్రభుత్వం కక్ష పూరిత చర్యలు చేపట్టడమే కాకుండా అక్రమ కేసులు బనాయించిందన్నారు. ఈ విధమైన ధోరణిని ఇప్పటికైనా వారు మార్చుకోవాలని విమర్శించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ సేవాసమితి సభ్యులు కఠారి హరిబాబు, గోగిశెట్టి మహేష్, కామిశెట్టి అమరనాథ్, పూసాల పుల్లారావు, బెంబవరపు మహీధర్, కఠారి నాయుడు, సంకా మురళి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ జానకీరామ్



నూతన సీఐ జానకీరామ్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న చిల్లకల్లు ఎస్‌ఐ దుర్గాప్రసాద్

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట నూతన సీఐగా నియమితులైన ఎం.జానకీరామ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు జగ్గయ్యపేట సీఐగా విధులు నిర్వహించిన అడపా నాగమురళి స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ కాగా, విజయవాడ సిటీ సీఐగా విధులు నిర్వహిస్తున్న జానకీరామ్ పేట సీఐగా బదిలీపై వచ్చిన విషయం విదితమే. ఈ సందర్భంగా చిల్లకల్లు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ మంగళవారం సాయంత్రం సీఐను మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రధాన కూడళ్లలో డ్రగ్స్ రహిత సమాజ కటౌట్లు



పేటలోని ప్రధాన కూడళ్లలో పోలీసులు ఏర్పాటు చేసిన డ్రగ్స్ రహిత సమాజ భారీ కటౌట్లు

జగ్గయ్యపేటఅర్బన్: డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు మరింత అవగాహన కలిగించే విధంగా జగ్గయ్యపేట పోలీస్ శాఖ వారు పేట పట్టణంలోని ప్రధాన వీధుల్లో భారీ కటౌట్లు ఏర్పాటు చేస్తున్నారు. పట్టణ ఎస్‌ఐ బీవీ రామారావు ఆధ్వర్యంలో స్థానిక బలుసుపాడు సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ కూడలి, పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో ఎత్తయిన భవనాలపై ఈ కటౌట్లు ఏర్పాటుచేశారు. వీటిని అన్ని ప్రధాన కూడళ్లలో ఏర్పాటుచేస్తున్నట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

నూరుశాతం రుణాల రికవరీ అభినందనీయం

కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు

ఊటుకూరు(గంపలగూడెం): ఊటుకూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మెంబర్ లొపెల్ రుణాలు నూరుశాతం రికవరీ కావడం అభినందనీయమని గంపలగూడెం కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బ్యాంకులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి ఉమామహేశ్వరరావు, సీఈఓ వెంకట నరసయ్యకు చీఫ్‌మేనేజర్ శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలో 695 మంది రైతులు తీసుకున్న రూ. 687.57లక్షల రుణాలను సకాలంలో చెల్లించినట్లు తెలిపారు. రుణాల రికవరీకి కృషి చేసిన పాలకవర్గం, సొసైటీ సిబ్బందిని ఆయన అభినందించారు. మేనేజర్ కంచర్ల కనక దుర్గ, సూపర్‌వైజర్ కొండయ్య, ఏసోబు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం





వర్షానికి తడిసిన కల్లాల్లోని పసుపు కొమ్ములు, తడిసిన పసుపు కొమ్ములను చూపిస్తున్న రైతు

అకాల వర్షం రైతులకు అపార నష్టం కలగజేస్తోంది. నందిగామ ప్రాంతంలో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పసుపు పంటకు భారీ నష్టం కలిగే ప్రమాదం నెలకొంది. ఉద్యానవన శాఖ అధికారుల లెక్కల ప్రకారం నందిగామ నియోజకవర్గంలో 252 ఎకరాలలో ఈ ఏడాది రైతులు పసుపు పంట సాగు చేశారు. ప్రస్తుతం 90 శాతం పంటను భూమిలో నుంచి వెలికి తీసిన పసుపు కొమ్ములను ఉడకబెట్టి కల్లాల్లో ఆరబెట్టారు. ఈ తరుణంలో కురిసిన అకాల వర్షం కారణంగా కల్లాలలోని పసుపు కొమ్ములు తడిశాయి. కొమ్ము తడవడంతో పాటు మంగు వాతావరణం నెలకొని ఉండడంతో పసుపుకొమ్ములు రంగు మారిపోతున్నాయి.

చేతికొచ్చిన పంట కళ్ల ముందే దెబ్బతింటోందని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా దెబ్బతిన్న పసుపు కల్లాలను ఉద్యానవన శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు.

మంగళవారం కూడా నందిగామ ప్రాంతంలో వర్షం కురుస్తూనే ఉంది. దీంతో రైతుల్లో మరింత భయాందోళన నెలకొంది.

– నందిగామ

శివశంకర ఆలయంలో ప్రత్యేక పూజలు



కీసర శివాలయంలో భక్తులకు అన్న సమారాధన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కీసర(కంచికచర్ల): మండలంలోని కీసరలో కొలువై ఉన్న భువనేశ్వరి పీఠ పాలిత అమ్మా లలిత లోకేశ్వర శివశంకర ఆలయం తొమ్మిదవ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అర్చకులు ముందుగా ఎమ్మెల్యేను పూర్ణకుంభంతో ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. స్వామి వారి విశేష వస్త్రంతో సత్కరించారు. వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మూడు వేల మందికి అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పరిటాల వీరభద్రరావు, పరిటాల రాము, వేల్పుల రమేష్, పాపట్ల స్వామి, నరసింహారావు పాల్గొన్నారు.

ముస్నలూరులో...

మండలంలోని కునికెనపాడు గ్రామంలో ఉన్న అంకారేణుకమ్మ కొలుపుల మహోత్సవం సోమవారం రాత్రి జరిగాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు పాల్గొని అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు చింతా రవీంద్రనాథ్, రాయల నరసింహారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి

సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్

జగ్గయ్యపేటఅర్బన్: నిరుపేద మహిళలకు సురక్షితమైన కాన్పుల కోసం ప్రభుత్వాస్పత్రుల్లోనే సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, తద్వారా ప్రభుత్వం నుంచి అనేక ప్రోత్సాహకాల లబ్ధిని పొందుతారని ప్రభుత్వాస్పత్రి(సామాజిక ఆరోగ్య కేంద్రం) సూపరింటెండెంట్ డాక్టర్ ఆళ్ల హరీష్ అన్నారు. ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని మంగళవారం పీపీ యూనిట్ విభాగం భవనంలో ఏర్పాటుచేసిన ఆశ కార్యకర్తల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నార్మల్ డెలివరీలు అయ్యేలా ఆశ వర్కర్లు గర్భిణులను ప్రోత్సహించాలన్నారు. సుఖ ప్రసవాల వలన తల్లీ బిడ్డ సురక్షితంగా ఉంటారని, మాతృ మరణాల సంఖ్య తగ్గుతుందన్నారు. మొదటి కాన్పు ద్వారా పీఎంఎంవీవై పథకం ద్వారా రూ.6 వేలు పొందుతారని, మామూలు డెలివరీ అయితే రూ.5 వేలు అందజేస్తారని తెలిపారు.

వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

మంటలు మండుతున్న ఎండలకు గర్భిణులు, చంటి బిడ్డలు, వృద్ధులు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల లోపు బయటకు రాకుండా ఉండాలని తెలిపారు. తప్పనిసరై రావాల్సిన పరిస్థితుల్లో ఇంట్లో నిమ్మరసం, పల్చటి మజ్జిగ తాగాలని, తలకు టోపీ, గొడుగు, కళ్లజోడు ధరించాలని తెలిపారు. వడదెబ్బ తగిలినపుడు నీడ ఉన్న ప్రదేశానికి తీసుకువెళ్లి శరీరమంతా తడిగుడ్డతో తుడిచి శరీర ఉష్ణోగ్రత మామూలు స్థితికి వచ్చేలా చేయాలన్నారు. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ ద్రావణం, ఓఆర్ఎస్ తాగించాలని, రోగి అపస్మారక స్థితిలో ఉంటే నీరు తాగించవద్దని, దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తరలించాలని సూచించారు. పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ నాగరాణి, హెల్త్ విజిటర్ జానకి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్య నిర్దేశనంతో ముందుకు సాగాలి

- ప్రాంగణ ఎంపికల్లో పాలిటెక్నిక్ విద్యార్థులు
- నియామకపత్రాలు అందజేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



విద్యార్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే అవకాశాలు వాటంతటవే వస్తాయని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఉద్యోగ విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఇటీవల నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రముఖ కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఉద్యోగాలు సాధించటం అభినందనీయమన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అందుకనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నైపుణ్యం పెంపొందించుకునేలా ప్రత్యేక తరగతులు సైతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, హెచ్‌వోడీలు పద్మ సుభాషిణి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి



స్మృతివనం పనులు పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): స్మృతి వనం, విగ్రహం నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్వరాజ్య మైదానంలో జరుగుతున్న అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను మంగళవారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంబేడ్కర్ స్మృతివనం ఆవరణలో వర్షం నీటి గోతులను పరిశీలించి యుద్ధప్రాతిపదిక చర్యలు చేపట్టి వాన నీటిని కాల్వల్లోకి మళ్లించాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల మోటార్లు ఏర్పాటు చేసి మైదానంలో వర్షం నీరు నిల్వలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కారిడార్ మొత్తంలో గ్రానైట్ ఫుట్‌పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రధాన విగ్రహంతో పాటు మిగిలిన పనులనూ సమయంలోపు పూర్తి చెయ్యాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ పర్యటనలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఏపీఐఐసీ అధికారులు, కేసీపీ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.